క్లుప్తంగా

పంట నష్టం అందించాలి

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని అధికంగా ఉన్న జీడి, మామిడి రైతులకు పంట నష్టపరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బి.అప్పలనాయుడు కోరారు. శనివారం పాలకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా జీడిమామిడి పంటపైనే ఆధారపడి జీవించేవారు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది పంట పూర్తిగా దెబ్బతిని కనీసం పూత కూడా రాలేదని తెలిపారు. అధికారులు పరిశీలన చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

వీరఘట్టం: మండలంలోని చిదిమి, యు.వెంకమ్మపేట, తూడి, పాలమెట్ట పంచాయతీల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్టు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రచార కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభయ హస్తం పింఛన్ల పంపిణీ

భామిని: మండలంలో అభయ హస్తం పింఛన్లు పంపిణీ శనివారం జరిగింది. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వీటిని అందజేశారు. కార్యదర్శులే నేరుగా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని 237 మందికి వీటిని అందజేశారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

భామిని: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సతివాడలో పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మండల రాంబాబువా పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండా ఎగురువేసి ఊరేగింపు నిర్వహించారు. పార్టీ విస్తారక్ ఉమామహేశ్వరరావు పరిశీలనలో ఆవిర్భావ కార్యక్రమాలు నిర్వహించి దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ అందిస్తున్న సేవలు కొనియాడారు. బీజేపీ ఆవశ్యకతను వివరించారు. మండల పార్టీ నాయకులు జనపాల చంద్రశేఖరరావు, పిన్నింటి దాసునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

పాలకొండ రూరల్: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, వీఈఏలతో శనివారం నిర్వహించిన సమావేశంలో తాగునీటి సమస్యలపై చర్చించారు. 22 గ్రామ పంచాయితీల వారీగా సమీక్ష చేపట్టారు. 380 చేతిబోర్లు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయని సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు వివరించారు. వేసవి నేపథ్యంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులపైన, పారిశుద్ధ్య నిర్వహణపైన దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక, ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అందజేసిన సచివాలయ సిబ్బంది



పింఛన్‌ను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మన్మథరావు

గరుగుబిల్లి: గరుగుబిల్లి గ్రామానికి చెందిన కలిశెట్టి వెంకటనాయుడు అనారోగ్య కారణంగా విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు శనివారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మన్మథరావు విజయనగరం వెళ్లి చికిత్స పొందుతున్న వెంకటనాయుడుకు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. ఈ మేరకు స్థానికులు సచివాలయ సిబ్బందిని అభినందించారు.

సీఐ మంగరాజుకు సన్మానం



సీఐ మంగరాజును గజమాలతో సన్మానిస్తున్న ఆనందపురం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బోరపు మంగరాజును పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1993 సంవత్సరం చదివిన 10వ తరగతి విద్యార్థులు చినమేరంగి సర్కిల్ కార్యాలయానికి వచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సహచరుడు మంగరాజు పదోన్నతిపై సీఐగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. మిత్రుడు రమణ మాష్టారు మాట్లాడుతూ మంగరాజు విద్యార్థి దశ నుండి క్రమశిక్షణతో ఎదిగి ఉన్నత స్థానాలను అధిరోహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మీసాల రామనాయుడు, కంది సత్తిబాబు, దొంతల శ్రీను, పాపారావు, కోరాడ రాంబాబు, కొట్యాడ రోహిణి, పద్మ, చంద్ర, వెంకటలక్ష్మి, రెడ్డి వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఓటేయండి

- ప్రచారంలో బ్రహ్మారథం
- ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థన



ప్రజలకు అభివాదం చేస్తూ మండుటెండలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని, అభివృద్ధి పనులు చేశామని మళ్లీ ఇవి కొనసాగాలంటే సీఎంగా జగనన్ననే గెలిపించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని వారు కోరారు. మండలంలోని కంబర, చిట్టపులివలస, కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధి వైఎస్సార్‌సీపీ తోనే సాధ్యమన్నారు. సమసమాజ స్థాపన జగనన్న తోనే నెరవేరుతుందన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల వారు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. ప్రజల్లో జగనన్నకు ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక కూటమి కుట్రలు పన్నుతుందన్నారు. వీటిని ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు మాయమాటలు చెప్పి ప్రజల వద్దకు వస్తున్నారని తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలిందన్నారు. జగనన్న పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టమైందన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

హోరెత్తిన ప్రచారం

ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వస్తున్నారని తెలియడంతో కంబర, చిట్టపులివలస, కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లో ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎ మహిళలు హారతులిస్తూ నీరాజనాలు పలికారు. మహిళలు, యువకులు ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. రావాలి జగన్–కావాలి జగన్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని, వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, రంభ శ్రీనివాసరావు, గంట వెంకటరావు, గాడి సత్యంనాయుడు, ఆబోతుల దాలినాయుడు, ఆబోతుల సంఘంనాయుడు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు వైశ్యరాజు గోవిందరాజు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



తాటిశీలలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న కురుపాం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణి

- కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- చెముడుగూడ, ఇరిడి, కుక్కిడిలో ఎన్నికల ప్రచారం
- ఆమెకు సాదర స్వాగతం పలికిన ప్రజలు

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రతి ఇంటికి కలిగిన సంక్షేమాన్ని చూసి మరోసారి ఆశీర్వదించాలని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడ పంచాయతీ పరిధిలోని తాటిశీల, అడ్డంగూడ, చెముడుగూడ, మురడ, పుట్టజమ్మువలస, పుట్టజమ్ము, ఇరిడి పంచాయతీలోని కన్నయ్యగూడ, కొత్తగూడ, ఇరిడి, తోలుఖర్జ, కుక్కిడి పంచాయతీలోని నిగరాం, పెద్దగూడలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. విజయతిలకం దిద్ది ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పెన్షన్ కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, నాడు–నేడు వంటి పథకాల కింద ప్రతీ కుటుంబానికి లబ్ధికల్పించిందన్నారు. వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పాలనను చేరువచేసిందన్నారు. సచివాలయ వ్యవస్థను సృష్టించి వేలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించిందన్నారు. దేశంలోనే ఆదర్శవంత పాలనకు మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనతో పాటు అరకు ఎంపీగా పోటీ చేస్తున్న తనూజారాణిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ మండల కన్వీనర్ సామల మాధవరావు, తోయక గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోగపురపు నాగు, కె.వెంకటరావు, బిడ్డిక చంద్రమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేలా...



ఎల్.ఎల్.పురంలో స్వీప్ ఏక్టవీటీపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి

పాలకొండ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపొందేలా ఓటర్లు చైతన్యవంతులు కావాలని మండల ఎన్నికల నోడల్ అధికారి ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎల్.ఎల్.పురం గ్రామంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేట్ (స్వీప్ ఏక్టవీట్) కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ విద్యా, అవగాహన, వ్యాప్తి వంటి అంశాలపై దృశ్య రూపంలో వివరించారు. ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానంలో లోపాలు తలెత్తకుండా అవగాహన కల్పించారు. సాంకేతికతపై ఓటరుకు అవగాహన అందించటం ద్వారా ఓటింగ్ శాతం పెంచే అవకాశాలు మెరుగుపర్చటమే లక్ష్యమన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఆవశ్యకత, అమలు వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలను చైతన్యపర్చారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

10న భద్రగిరి ఆర్‌ఐటీఐ వద్ద జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఆర్‌ఐటీఐ వద్ద ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ, డిగ్రీ, డిప్లమాలో ఉత్తీర్ణత పొందిన 18 నుంచి 28 ఏళ్ల వయస్సులోపు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనాలని, ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీకి చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 79813 08986 లేదా 6304086821 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మాణికేశ్వరమ్మకు పుష్పశ్రీవాణి పూజలు



తాటిశీలలోని మాణికేశ్వరమ్మదేవత ప్రతిమకు పూజచేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికలో విజయం సాధించేలా.. దీవెనలందివ్వమ్మా.. అంటూ కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గుమ్మలక్ష్మీపురం మండలం తాటిశీల గ్రామంలోని మాణికేశ్వరమ్మను వేడుకున్నారు. అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించే ముందు అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ. 2014, 2019 ఎన్నికల్లోవలే ఇప్పుడు కూడా మాణికేశ్వరమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆమెకు వేదాచార్యులు రంపా తాతబాబుశర్మ వేదాశీర్వచనాలు అందజేశారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.ఎస్.చైతన్య ప్రవంతి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

వీరఘట్టం: టీడీపీ నేతలు తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వీరఘట్టం మండలంలో వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. గురువారం చిదిమి సచివాలయంలో 15 మంది వలంటీర్లు రాజీరామాలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం కిమ్మి సచివాలయ పరిధిలో ఉన్న కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ పంచాయతీలకు చెందిన 20 మంది వలంటీర్లు, పి.వి.ఆర్.పురం పంచాయతీకి చెందిన 8 మంది వలంటీర్లు తమ రాజీనామాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్నామే తప్ప మేమెప్పుడూ రాజకీయాలు చేయలేదన్నారు. తమకు వలంటీరుగా అవకాశం ఇచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో సముచిత స్థానం కల్పించడంతో మేమంతా స్వచ్ఛందంగా పనిచేస్తున్నామన్నారు. మా మనోభావాలను దెబ్బతీస్తూ ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేయించడం మమ్మల్ని ఎంతగానో బాధించిందన్నారు.

రహదారిపై ఏనుగులు



సుభద్రమ్మవలస రహదారి పక్కన ఉన్న వరి చేలలో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస ప్రధాన రహదారిపై శనివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. రహదారి పక్కన వరి, అరటి, పామాయిల్, జొన్న పంట ఉండడంతో వాటిలో తింటూ రహదారిపైకి రావడంతో వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. ఏనుగుల సంచారంతో గంటల పాటు రహదారిపై వాహనదారులు వేచి ఉండాల్సి వస్తుంది. పంటలను ధ్వంసం చేస్తున్నా అటవీ సిబ్బంది వాటిని తరలించడానికి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గర్భిణులకు హైజనిక్ కిట్ల పంపిణీ



గర్భిణులకు హైజనిక్ కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం వైటీసీలోని గిరిజన గిరిశిఖర గ్రామాల వసతిగృహంలోని 32 మంది గర్భిణులకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు హైజనిక్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గర్భిణులు హైజనిక్ కిట్లను అందజేయడం జరుగుతోందని, గర్భిణులంతా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందజేసే వైద్య సేవలు, వసతి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు జి.హరిప్రసాద్, పి.కొండలరావు, వైటీసీ మేనేజర్ రాము, వైటీసీ సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

గుమ్మలక్ష్మీపురం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ బి.రామారావు కోరారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన స్వీప్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదని, ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ నిజాయితీ గల నాయకున్ని ఎన్నుకునేందుకు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ బి.త్రినాథ, అధ్యాపకులు కల్పన, స్వరూప, ఉప తహసీల్దార్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమృత భూమి చిత్రానికి ఉగాది పురస్కారం

గరుగుబిల్లి: తోటపల్లిలోని ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో జట్టు స్వచ్ఛంద సంస్థ రూపొందించి చిత్రీకరించిన అమృత భూమి చలన చిత్రం ఉగాది పురస్కారానికి ఎంపికయ్యిందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు శనివారం తెలిపారు. ఏపీ ఫిల్మ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి జేవీ మోహన్‌గౌడ్ ఈ సమాచారాన్ని అందించారన్నారు. ఏప్రిల్ 7న విజయవాడలోని మంగళగిరిలో హ్యాపీ రిసార్ట్‌లో జరిగే కార్యక్రమంలో ఉగాది పురస్కారాన్ని అందిస్తారని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన : డీఎస్పీ



కొత్తూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం లేకుండా చూడాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని కొత్తూరు, ఉద్దవోలు, చినగుడబ, వల్లరగుడబ, ఎస్ఆర్‌పేట, రావుపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, భద్రతపరమైన అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. పరిశీలనలో ఎస్ఐ వై.అమ్మన్నరావు తదితరులున్నారు.

పోలింగ్ స్టేషన్ల భద్రతపై ఆరా

కొమరాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల భద్రతపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం సీఐ కె.రవికుమార్ అన్నారు. మండలంలోని నాగావళి నది ఆవల ఉన్న గ్రామాలైన మాదలింగి, దళాయిపేట, కొట్టు, తొడుము, కోదులగుంప, గుణద తదితర గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియామవళిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ నీలకంఠ తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలి



మేం సిద్ధం అంటూ ఐక్యత ప్రకటిస్తున్న మండల బూత్ కమిటీ కన్వీనర్లు, నాయకులు

భామిని: బూత్ కమిటీ కన్వీనర్లు విధిగా ఓటర్ల జాబితాలు నిశితంగా పరిశీలించాలని, జాబితాలో పేర్లు లేకుంటే గుర్తించి ఆన్‌లైన్ దరఖాస్తు చేయించాలని పాలకొండ నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ నల్లి శివప్రసాద్ సూచించారు. మండలంలోని భామిని, ఘనసరలలో శనివారం నిర్వహించిన బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలోని ఓటర్లు ఎక్కడ ఉన్నది కూడా గుర్తించి సమాచారం ఇవ్వాలన్నారు. సచివాలయ కార్యదర్శులు, గృహసారథులను అప్రమత్తం చేయాలని సూచించారు. మేం సిద్ధం అంటూ నినదించారు. జేసీఎస్ కోఆర్డినేటర్లు కొత్తకోట చంద్రశేఖర్, కోట అజయ్, మండల పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, కార్యదర్శి ఫల్గుణరావు, కన్వీనర్లు పాల్గొన్నారు.

● నాడు రాళ్లు తేలి.. నేడు రాజసంగా...

సీతంపేట మండలంలో ఎత్తైన కొండలపై ఉన్న పొంజాడ గ్రామానికి దశాబ్దాల కాలంగా అధ్వానంగా ఉండే రహదారి జగనన్న పాలనలో అద్దంగా మారింది. టీడీపీ పాలనలో రాళ్లు తేలిన రహదారిపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించాలన్నా.. రోగులకు ఆస్పత్రులకు తీసుకువెళ్లాలన్నా... అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు ఐదు కిలోమీటర్ల రహదారిని రూ.1.5కోట్లతో నిర్మించారు. దీంతో గిరిజనులు సంబరపడుతున్నారు. – సీతంపేట



పొంజాడ రహదారి దుస్థితి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన రహదారి

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

గరుగుబిల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ అమ్మన్నరావు కోరారు. మండలంలోని రావివలస గ్రామంలో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఆయన వెంట పోలీసులు వై.డి.దొర, జి.శ్రీహరి ఉన్నారు.



రావివలసలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు